

# హైదరాబాద్ వార్త

## భారతీయులపై హెచ్ -1బి వీసా

# ఫీజు పెంపు భారం

### -టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం - పెరిగిన విమాన చార్జీలు

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** భారతీయులపై అమెరికా హెచ్ -1బి వీసా పీజు రూ.లక్ష డాలర్లకు పెంచింది. అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కన్న భారతీయ విద్యార్థులకు అమెరికా పిడుగు లాంటి వార్త అందించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసా దారులపై కీలక నిర్ణయం తీసుకున్నారు. హెచ్ -1 బి వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వహక ఉత్వర్వుపై సంతకం చేశారు. దీంతో ఇక మీదట అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కొక్క వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో కొత్త హెచ్ -1 వీసా విధానం భారత్‌తోపాటు పలు దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి హెచ్ -1 వీసాపై ఏటా లక్ష డాలర్లు రుసుం విధించినట్లు యుఎస్ కామర్స్ సెక్రటరీ హోవార్డ్ టుక్నిక్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ప్రకటిస్తుండగా, కొత్త వీసా విధానం వల్ల భారత్‌తోపాటు, చైనా తదితర దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. సెప్టెంబర్ 21 నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. దీనికి సబంధించి ఇప్పటికే అన్ని పెద్ద కంపెనీలకు వివరించినట్లు తెలిపారు. అమెరికన్లకు మేలు చేసే విధంగా ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో ఉద్యోగాలను కొల్లగొడుతున్న వారిని ఇతర దేశాల నుంచి తీసుకుని రావడం అపాలని సూచించింది.




**భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం :** హెచ్ -1 వీసా రుసుం లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయంతో భారత టెక్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నేషనల్ అసోసియేషన్ అఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీ అందోళన వ్యక్తం చేసేఇంది. ఈ పరిణామాలతో అఫ్‌షోర్ ప్రాజెక్ట్‌లకు అంతరాయం కలిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా 24 గంటలలోనే దీనిని అమలు చేస్తున్నట్లు ప్రకటించడం కూడా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు, నిపుణులల్లో మరింత అనిశ్చితికి కారణమైందని పేర్కొంటున్నారు.

**భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం :** హెచ్ -1 బి వీసా రుసుం సాధరణంగా 2వేల నుంచి ఐదు వేల డాలర్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం దీనిని లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ వీసా కార్యక్రమం కింద భారత్‌కు చెందిన అనేక కంపెనీలు ప్రయోజనం పొందుతున్నాయి. వేలాది మంది నిపుణులను అమెరికా పంపిస్తున్నాయి. అమెజాన్, టిసిఎస్ మైక్రోసాఫ్ట్, మెటా, యాపిల్, గూగుల్, కాగ్నిజెంట్, జెపి మార్గన్ చేజ్, వాల్‌మార్ట్, డెలాయిట్, ఇన్ఫోసిస్, ఎల్‌టి మెండ్‌టి, హెచ్‌పిఎల్ తదితర కంపెనీలలో భారతీయులు పనిచేస్తున్నారు.1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్ -1 వీసాను తీసుకుని వచ్చారు. యుఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్ -1బీ వీసా దారులలో భారత్ 71 శాతం కలిగి ఉందని, చైనా 11.7 శాతం వాటా కలిగి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. వీటిని మూడు నుంచి అరేళ్ల మధ్య కాలానికి జారీ చేస్తారు. తాజాగా విధించిన పీజులతో భారతీయులపై తీవ్ర స్థాయిలో భారం పడనుందని పలువురు పేర్కొంటున్నారు. దీని ప్రభావం సుమారు 60వేల మంది భారతీయులపై పడనుందని, దీంతో వార్షిక భారం అరు బిలియన్ డాలర్లు సుమారు రూ53వేల కోట్లుగా ఉండనుందని తెలిపారు.అమెరికాలో మధ్యస్థాయి ఇంజనీర్ ఏడాదికి 1.20వేల డాలర్లు సంపాదిస్తే అందులో లక్ష డాలర్లు వీసా పీజు అంటే 80 శాతం జీతం అక్కడే పోతుంది. దీని వల్ల అత్యధిక వేతనం పొందే వారు మినహా మిగిలిన వారు అమెరికా వలస వెళ్లడం పెనుభారంగా మారనుంది. చాలా సందర్భాల్లో కంపెనీలే ఈ వీసా చార్జీలను భరిస్తాయి. ఈ పరిస్థితుల లో విదేశీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేందుకు కంపెనీలు మెగ్గు చూపకపోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. అమెరికాలో మాస్టర్స్ చేసి పిహెచ్‌డి పూర్తి చేసిన తర్వాత హెచ్ -1బీ వీసాలకు మారే కమ్యూనిటిలో భారతీయులదే అధిపత్యం ఉందని పేర్కొంటున్నారు.

**దేశమంతా హెచ్ -1 బి వీసా గందరగోళం :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు ప్రపంచం అల్లాడిపోతుంది. హెచ్ -1 బీ వీసాలపై లక్ష డాలర్ల పీజుతో పాటు అమెరికాలో ఎం ట్రీకి సెప్టెంబర్ 21 వరకు మాత్రమే గడువు ఉండడంతో టెక్ కంపెనీలు షాక్ అయ్యాయి. సెలవులు, వ్యాపారం తదితర పనుల తో బయట ఉన్న హెచ్ -1 వీసాదారులు గందర గోళలో పడ్డారు. దీంతో ఉన్న పళంగా అమెరికాకు తిరుగు ప్రయాణం అయ్యారు. విమానాశ్రయాల వద్ద భారీగా క్యూలు కట్టారు. విమాన చార్జీలు మూడింతలు పెరిగినట్లు పలువురు పేర్కొంటున్నారు.అమెరికా ఏటా విదేశీ టాలెంట్ కోసం అందించే మొత్తం హెచ్ -1 బీ వీసాల్లో 73 శాతం వరకు భారతీయులకే దక్కు తున్నాయి. దీంతో తాజా మార్పుల వల్ల సుమారు 2లక్షల మంది భారతీయులపై ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. భారతదేశానికి ఏటా రూ.2లక్షల కోట్ల వరకు అదాయం నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



# బతుకమ్మ వచ్చింది.. సంబరాలు తెచ్చింది



**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**

బతుకమ్మ సందడి ఒక రోజు ముందే ఆరంభమైంది. శనివారం సాయంత్రం సంప్రదాయం ప్రకా రం కూకట్‌పల్లిలో ఎంగిలిపూల పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. అమా వాస్యకు ముందురోజే బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించడం కూకట్‌పల్లిలో అనవాయితి. మొదటి రోజు మహిళలు భారీ ఎత్తున బతుకమ్మలతో హనుమాన్ చౌరస్తాకు తరలివచ్చారు. అక్కడే ఆట పాటలతో బతుకమ్మను పూజించారు. ఒకరికొకరు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం రంగధాముని చెరువు వద్దకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న సూపర్ మార్కెట్‌లు

-గడువు ముగిసిన వస్తువులు సైతం అమ్మకాలు
-నగరవ్యాప్తంగా 44చోట్ల జిహెచ్‌ఎంసి తనిఖీ
-పలు సూపర్‌మార్కెట్లకు నోటీసులు


సూపర్‌మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న జిహెచ్‌ఎంసి ఫుడ్‌సేఫ్టీ అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20,ప్రభాతవార్త:** నగర వ్యాప్తంగా సూపర్ మార్కెట్లలో జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గత రెండురోజులుగా వివిధ ప్రాంతాల్లోని స్టోర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విస్తుపోయే నిజాలు బయపట్టడాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు వ్యవహరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గడువు ముగిసినా కూడా ఆయా పదార్థాలను అమ్ముతున్నట్లు బయపడింది. నగరవ్యాప్తంగా మొత్తం 44 సూపర్ మార్కెట్లలో అధికారులు తనిఖీలు చేశారు. దాదాపు 58 శాంపిల్స్ సేకరించి టెస్ట్‌ల కోసం ల్యాబ్‌కు పంపించారు. పలు సూపర్ మార్కెట్‌లో వెజ్, నాన్ వెజ్ ప్రొడక్ట్స్ ఒకే చోట స్టోర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఫుడ్ స్టోర్స్‌లో ఈగలు, దోమలు ఉన్నట్లు బయలపడింది.ఈ క్రమంలో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని పలు సూపర్ మార్కెట్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. సైదాబాద్ మోర్ రిటైల్‌లో సింథటిక్ కలర్స్‌తో ఫ్రూట్స్ అమ్ముతున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే కాచిగూడ రిలయన్స్ రిటైల్‌లో గడువు ముగిసిన విదేశీ అవకాడో, ఆరెంజెస్ అమ్ముతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అటు కొండాపూర్ విజేత సూపర్ మార్కెట్‌లో కూడా గడువు ముగిసిన పాలక్ రైస్ పాపడ్, థిక్ షేక్‌లు అమ్ముతున్నట్లు బయటపడింది. కొండాపూర్ రత్నదీప్ సూపర్ మార్కెట్, కేపీఎన్ ఫార్మ్ ఫ్రెష్‌లో గడువు ముగిసిన పన్నీర్, నిత్యవసర సరుకులు అమ్ముతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. సూపర్ మార్కెట్లలో వస్తువులు కొనే ముందు వాటి ఎక్స్‌పైరీ డేట్ చూసి మరీ కొనాలని ప్రజలకు ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచనలు చేశారు.

## జూబ్లీహిల్స్ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు


జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి


పెద్దమ్మతల్లి దేవాలయం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 20, ప్రభాతవార్తః** ఈ నెల 22 నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నదమవుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా 22వ తేదిన ఉదయం అమ్మవారికి అభిషేకం, 9.05 గంటలకు నవరాత్రోత్సవ పూజలు ఆలయ వ్యవస్థాపకులైన పీజేఆర్ కుటుంబ సభ్యులచే పా్రరంభమవుతాయి. ఉదయం వివిధ పూజా కార్యక్రమాలతోపాటు రాత్రి వేళ పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తి పల్లకి, పవళింపు సేవ కొనసాగుతాయి. 30వ తేదిన రాత్రి 9.30 గంటలకు చండీ హోమము, 1వ తేదిన ఉదయం 9 గంటలకు బలి ప్రదానం, మహాపూర్ణాహుతి వేడుకలు కొనసాగుతాయి. ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి 22న బాలాత్రిపురసుందరీదేవిగా, 23న గాయత్రిదేవిగా, 24న గజలక్ష్మి దేవిగా, 25న అన్నపూర్ణాదేవిగా, 26న లలితాదేవిగా, 27న రాజరాజేశ్వరిదేవిగా, 28న స్కందమాతదేవిగా, 29న సరస్వతిదేవిగా, 30న దుర్గాదేవిగా, 1న మహిషాసురమర్ధిని దేవిగా, 2న పెద్దమ్మతల్లి రూపంలో భక్తులకు దర్శనమివ్వనుంది. ఉత్సవాల నేపథ్యంలో 22 నుంచి 30వ తేది వరకు(28 మినహా) అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. 1వ తేదిన లలిత సహస్రనామ కుంకుమార్చన ఉంటుందని, భక్తులు ముందుగానే తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

### అంగన్‌వాడీలో పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్దులు నేర్పించాలి


గంగానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం.

**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి సరైన విద్యాబుద్దులు నేర్పించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గంగానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషక వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పోషకాహారం అందిస్తేనే ఆరోగ్యవంతులుగా పిల్లలు ఎదుగుతారని పేర్కొన్నారు.పిల్లలకు ఎదిగే దశలో చదువు జ్ఞానాన్ని అందిస్తుందని అందుకే వారికి చిన్నతనం నుంచే మంచి పౌష్టికరమైన ఆహారం అందించాలన్నారు.అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో కచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిడివో పావణి, సూపర్‌వైజర్ శ్వేత, అంగన్‌వాడి సెంటర్ల టీచర్లు వరలక్ష్మీ, మంజుల, ఉమారాణి, పద్మజ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, లింగంగౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### మెట్రో ప్రాజెక్టుపై అధికారులతో ఎండి సర్ఫరాజ్ అహ్మద్ సమీక్ష



మెట్రో భవన్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మెట్రో ఎండి సర్ఫరాజ్ అహ్మద్

**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై హెచ్‌ఎంఆర్‌ఎల్, హెచ్‌ఏఎంఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ శనివారం సమీక్షించారు. మెట్రో రైల్‌కి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు మెట్రో రైల్ మొదటి దశ ప్రాజెక్ట్ స్థితిగతులను ఎండీ వివరించారు. మెట్రో రైల్‌భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అధికారులతో ఆయన ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను సమీక్షించారు. ప్రస్తుతం నడుస్తున్న పాత నగరం మెట్రో కారిడార్ విస్తరణ పనులు జరుగుతున్న తీరుతెన్నులను ఆయన సమీక్షించారు. పాత నగరంలో పనులు వేగవంతం చేయాలని, సవాళ్ళను అధిగమించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఎండీ సూచించారు. ఫేజ్ 2ఏ, ఫేజ్ 2బి తాజా పరిస్థితిని సమీక్షించారు. అలాగే రెండో దశకు సంబంధించి హెచ్‌ఏఎంఎల్ తీసుకుంటున్న చర్యలను సమీకించారు. హైదరాబాద్‌ను విస్తృతంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి మార్గదర్శనంలో అనేక పనులు చేపట్టామని, వాటిని విజయవంతంగా పూర్తి చేయడంలో అధికారులు కృషి చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు.

### యువతలో నైపుణ్యాలు పెంపొందిస్తూ ఉపాధి మార్గాలు

#### వన్‌ఎంవన్‌బి కార్యక్రమాలకు జిహెచ్‌ఎంసి మద్దతు



ఉద్యోగార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న అడిషనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ రమాదేవి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా యువత సాధికారతకు నడుం బిగించాయి. క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన లాభాపేక్షలేని సంస్థ వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బి) అణగారిన వర్గాల సాధికారత, యువత నాయకత్వ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన శిక్షణ కార్యక్రమాలకు మద్దతు నిస్తున్నాయి. ఇందులో భాగంగా 20 మంది ఉద్యోగార్థులకు డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. వారిలో 6 మందికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. తదుపరి దశలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.ఈ సందర్భంగా 1.5 మ్యాటర్స్" అనే ప్రచారం గురించి చర్చ జరిగింది. వాతావరణ పరిరక్షణ, సస్టైనబిలిటీపై యువతలో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ ప్రచారం సాగుతోంది. సమానత్వంతో కూడిన తెలంగాణ అనే సీఎం అనే నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు ఉన్నాయి.ఈమేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్. పంకజా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి లంక తదితర అధికారులు ఉద్యోగార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

### నేరాల నియంత్రణే మా లక్ష్యం : డిసిపి సిహెచ్ శ్రీనివాస్

#### -విస్తృతంగా కార్డన్ సెర్చ్ -భారీగా వాహనాలు స్వాధీనం





**అత్తాపూర్ సెప్టెంబరు20 ,ప్రభాతవార్త :** నేరాల నియంత్రణే మా లక్ష్యమని అందుకోసం కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహించినట్లు రాజేంద్రనగర్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు.శనివారం అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని హసన్ నగర్, ఇంద్రనగర్ తదితర ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా డిసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ...కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం ప్రజలను అప్రమత్తం చేయడమేనని అన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించే సమయంలో అన్ని సర్టిఫికెట్ల వెంట ఉంచుకోవాలన్నారు.12 సెర్చ్ టీంలతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామని తనిఖీలో 55 ద్విచక్ర వాహనాలు పట్టుకోవడం జరిగిందని సరైన పత్రాలు లేని 16 వాహనాలు,నెంబర్ ప్లేట్స్ లేని 35 ,సరైన పత్రాలు లేని 6 ఆటోలు,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న 9 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అదేవిధంగా 2 బెల్టు షాపులను సీజ్ చేయడం జరిగిందని 2 హుక్కా సెంటర్లు,గ్యాస్ ఫిల్లింగ్ రీఫిల్ సెంటర్లపై దాడులు చేయడం చలానాలు కట్టకుండా తీరుగుతున్న వాహనాలను గుర్తించి చలనాలు కట్టించడం చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి ,డ్రగ్స్ సరఫరా చేస్తున్నటు తెలుస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.యువత చెడు అలవాట్లకు లోనకాకుండా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి ఎఎస్ రావు,ఎసిపి శ్రీనివాస్,సిఐలు నాగేశ్వర రావు,క్యాస్ట్రో, నరేందర్, డిఐలు,ఎస్‌లు,తదితరులు పాల్గొన్నారు.

### బోయిన్‌పల్లి మార్కెట్‌ను సందర్శించిన 15 రాష్ట్రాల ట్రైనర్లు



**కంటోన్మెంట్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** దేశంలో అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా అవతరించిన సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్‌ను దేశంలోని 15 రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శుల ఎంపిక లో శిక్షణ పొందుతున్న ట్రైనర్లు శనివారం బోయిన్‌పల్లి మార్కెట్ ను సందర్శించారు. మార్కెట్‌లో వివిధ రకాల కూరగాయలు, వ్యాపార లావదే వీలు,కుళ్లిన కూరగాయలతో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ కేంద్రాన్ని పరిశీలించారు. మార్కెట్ చైర్మన్ అర్.అనంద్ బాబు, కార్యదర్శి వెంకన్న, వైస్ చైర్మన్ దేవుడులు దగ్గరుండి మార్కెట్‌ల కార్యకలాపాలను వారికి వివరించారు.

### ఆడవేషం కట్టి.. స్నేహితుడి ఇంట్లో చోరి

- సిసి కెమెరాలకు చిక్కిన టెక్నీషియన్
- 6.75 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


ఆడవేషంలో హర్షిత్(సీసీటీవీ ఫుటేజీ)

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 20, ప్రభాతవార్తః** పోలీసుల కళ్లుగప్పేందుకు ఆడవేషం కట్టాడు.. స్నేహితుడి ఇంట చోరీకి పాల్పడ్డాడు.. అనుమానంతో చోరి చేసిన ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించేందుకు వెళ్లాడు.. చివరికి పోలీసులుక చిక్కి కటకటాలపాలయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటన వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 11లోని ఉదయ్‌నగర్‌లో నివసించే శివరాజ్ ఈ నెల 16న తన కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్ ప్రాంతానికి వెళ్లాడు. ఈ విషయాన్ని శివరాజ్ కుమారుడు తన స్నేహితుడైన లింగంపల్లిలో నివసించే సీసీ కెమెరా టెక్నీషియన్‌గా పనిచేసే చిత్తూరు జిల్లా ప్రాంతానికి చెందిన హర్షిత్(26)కు చెప్పాడు. మరునాడు తిరిగి వచ్చేసరికి శివరాజ్ ఇంటి తాళం పగులగొట్టి అల్మారాలో పెట్టిన 6.75 తులాల బంగారు ఆభరణాలు, రూ. 1.10 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బంజారాహిల్స్ డిఐ కవియుద్దీన్, డిఎస్సై యాసిన్ అలీ తమ బృందంతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఒక మహిళ శివరాజ్ ఇంటికి, వెళ్లడం, తిరిగి వెళ్లిపోవడాన్ని గుర్తించారు. దీంతో మహిళ ఈ చోరీకి పాల్పడి ఉంటుందని పోలీసులు భావించారు. అయితే చుట్టుపక్కల ఉన్న సీసీ టీవీ కెమెరాలను చూస్తున్న క్రమంలో ముందు రోజు ఒక వ్యక్తి వచ్చి సీసీ టీవీ కెమెరాలను పరిశీలించాడంటూ సీసీటీవీ కెమెరా ఇంటి యజమాని పోలీసుల దృష్టికి తీసుకొచ్చాడు. అనుమానంచిన పోలీసులు సీసీ కెమెరాలో పరిశీలించగా శివరాజ్ కుమారుడు ఫుటేజీలో ఉంది తన స్నేహితుడని పోలీసులకు తేల్చిచెప్పాడు. దీంతో పోలీసులు లింగంపల్లిలో ఉన్న హర్షిత్ ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా ఇంట్లో 6.75 తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ. 85వేల నగదును గర్తించి అతన్ని విచారించారు. ఆడవేషంలో వచ్చింది తానేనని, పోలీసుల కళ్లుగప్పేందుకు ఇలా చేశానంటూ అంగీకరించాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా నిందితుడు లోన్ యాప్‌ల ద్వారావిపరీతమైన అప్పులు చేసినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. చోరి చేసిన సొమ్ములో రూ. 25వేలు లోన్‌యాప్ కోసం చెల్లించినట్లు నిందితుడు అంగీకరించాడు.

### 37 కిలోల గంజాయి స్వాధీనం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** రైల్‌లో గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను జి.ఆర్.పి,ఆర్.పి.ఎఫ్.పోలీసులు పట్టుకొని రూ.18.75 లక్షల విలువ చేసే 37 కిలోల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. శనివారం రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్లన సమావేశంలో ఈశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఒడిశా గంజం ప్రాంతానికి చెందిన అలుసిబ (30), బిక్రమ్, అమౌలతో పాటు 15 సంవత్సరాలు వయసులో ఉన్న ఓ బాలునితో కలిసి బరంపూర్, ఒడిశా నుంచి 37 కిలోల గంజాయిని ముంబాయికి తరలిస్తుండగా సికింద్రాబాద్ రైల్వే పోలీసులు,అర్.పి.ఎఫ్.పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా వారి వద్ద నుంచి రూ. 18.75 లక్షల విలువ చేసే 37 కిలో గంజాయిని స్వాధీనం చేసుకొని ఆలుసిబ, 15 సంవత్సరాల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. బిక్రమ్, అమౌలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జేహెచ్‌పీఎస్‌లో ప్రభాత్ పేరి కార్యక్రమం




ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు.

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచనా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు 'ప్రభాత్ పేరి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో వ్యాసరచన, పోస్టర్ తయారీ, నినాదాలు రాయడం తదితర పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ పి. కాంచనవల్లి మాట్లాడుతూ అజ్ఞానం, పక్షపాతం, విభజన చేయడంలో నిజమైన విముక్తి ఉందన్నారు. ఐక్యత, సామరస్యం, విలువలను కాపాడుకోవడం మన కర్తవ్యం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీని నిర్వహించారు.

## జీఎస్టీ తగ్గింపును స్వాగతిస్తున్నాం: ఐఎస్ఐసీఎంప

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** జీఎస్టీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు సౌత్ ఇండియన్ సిమెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్ఐసీఎంఏ) ప్రకటించింది. వస్తు సేవల పన్నును తగ్గించే ఈ నిర్ణయం వల్ల సిమెంటుపై జీఎస్టీని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించారని, తద్వారా గృహనిర్మాణరంగం, మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధికి గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందన్నారు. నిర్మాణ ఖర్చులను తగ్గించి, వ్యక్తిగత గృహనిర్మాణదారులు, గృహ ప్రాజెక్టులు, ప్రజామౌళిక సదుపాయాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ నూతన విధానాన్ని తమ వాటాదారులతో కలిసి పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాకారం చేయడంలో ఎస్ఐసీఎంఏ భాగస్వాములవుతామని అసోసియేషనన సీఈఓ ఐ. గోపీనాథ్ స్పష్టం చేశారు.

## వికలాంగులకు రూ. 6 వేలు పింఛన్ పెంచాలి



ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీకిషన్ మాదిగ తదితరులు

**అడ్డగుట్ట,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతు, వృద్ధులకు రూ.4 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసం లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్, ఎమ్మార్పీఎస్, సిహెచ్‌పిఎస్ నాయకులు దొబ్బశ్రీను రేఖా, విశ్వనాథ్ మాదిగ, మంద మధుకర్ మాదిగ, మధు మాదిగ, ప్రవీణ్, మక్కాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ లింగాని ప్రసన్నకు ఎమ్మార్పీఎస్ నేతలు వినతి



అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

**అడ్డగుట్ట,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వికలాంగులు, వృద్ధులు, వితంతులకు ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లను రూ. 6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ విహెచ్‌పిఎస్,సిహెచ్‌పిఎస్, ఎమ్మార్పీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జోగు దశరత్ మాదిగ, చందేటి వేణుగోపాల్ మాదిగ, అందె దయామణి, భువనేశ్వర్, కళాజ్యోతి,సుజాత మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం : సౌందర్య



అడ్డగుట్టలో విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య తదితరులు

**అడ్డగుట్ట,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆత్మ నిర్భర భారత్ వికసిత్ కార్యక్రమంలో భాగంగా శనివారం అడ్డగుట్ట పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన ముగ్గురికి అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షు రాలు బహుమతలునప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఇబ్రహీం బాగ్ ఎం సి హెచ్ కమిటీ హాల్ ముందు నిరసన తెలుపుతున్న స్థానికులు.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, గీత, చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, సంగారెడ్డి జిల్లా ఇన్ చార్జ్ వి ఎస్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం కాంగ్రెస్ పార్టీకే నష్టమన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ గ్రామపంచాయతీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా లంగర్ హౌస్ ఇబ్రహీం బాగ్ లోని ఎం సి హెచ్ కమిటీ హాల్ ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వి ఎస్ రాజు మాదిగ పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వస్తుందన్నారు. కానీ అవయవ లోపం ఉండి ఏ పని చేసుకుని వంటి వారికి ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, గీత, చేనేత మరియు చేయూత పెన్షన్ దారులందరికి ప్రభుత్వం 4వేలు పెంచడంతోపాటు కండరాల శీనత గల వికలాంగు 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు రాజు వస్తాద్, హనుమంతరావు పటేల్, వినాయక అశోక్, రాకేష్ పటేల్, పాండు యాదవ్, సాయి, చారి, శ్రీనివాస్ ముదిరాజ్, శాంతమ్మ తో పాటు అన్ని వర్గాల ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్వదేశీ వినియోగంతోనే దేశ స్వయం సమృద్ధి సాధ్యం : ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి.

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** విదేశీ దిగుమతులు తగ్గించుకొని, స్వదేశి వస్తువుల వినియోగం పెరగాలని, అప్పుడే దేశ స్వయంసమృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో స్వదేశి వస్తువుల వినియోగం పెంపు, జీఎస్టీ సరళీకరణ, ప్రభుత్వంపై పడుతున్న భారం తదితర అంశాలపై వివిధ పారిశ్రామిక, వ్యాపార వర్గాల ప్రతినిధులతో భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం ప్రాంతీయ ఉపాధ్యక్షుడు బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జీఎస్టీ కౌన్సిల్ ప్రవేశ పెట్టిన కొత్త జీఎస్టీ విధానంతో తాత్కాలికంగా కేంద్ర ప్రభుత్వానికి రావాల్సిన దాదాపు 7 లక్షల కోట్లు తగ్గనుందని, అయితే రానున్న కాలంలో జీఎస్టీ వల్ల ఎక్కువ మొత్తంలో పన్నులు వచ్చే అవకాశం ఉందన్నారు. విదేశాల నుంచి అనేక కీలక రంగాల్లో దిగుమతులు ఎక్కువగా చేసుకోవడం వల్ల విదేశీ మారకద్రవ్యం ఖర్చు చేయాల్సి వస్తుందని, ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తుందన్నారు. ఇటీవల అమెరికా విధిస్తున్న సుంకాల ప్రభావాన్ని తగ్గించుకొనేందుకు స్వదేవి ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన బలంగా చెప్పారు. స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రతినిధులు, వ్యాపారస్థులు, పారిశ్రామికవేత్తలు అంతా కలిసి రూపొందించే నివేదికను సైతం కేంద్ర ప్రభుత్వ సంబంధిత మంత్రిత్వ శాఖకు అందిస్తామన్నారు. బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం, రక్షణ రంగం, కృత్రిమ మేధ, డ్రోన్, భీమా, నిర్మాణ, పర్యాటక, ఉత్పత్తి రంగంతో సహా అనేక రంగాల్లో స్వదేశి వస్తువుల వినియోగాన్ని పెంచేందుకు అవకాశాలున్నాయన్నారు. సదస్సులో భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దార్థ శర్మ, స్వదేశి జాగరణ్ మంచ్ జాతీయ కన్వీనర్ సుందరం, ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ కశ్మీర్‌లాల్, సతీష్‌కుమార్, జాతీయ కో-కన్వీనర్ ఆచార్య అశ్విని మమాజన్, భగవంతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ పలకరింపులతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులను శాలువాతో ఘనంగా సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :** మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ్నన కోలాహలంగా జరిగింది. ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలను ఏర్పాటుచేసి 42 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కళాశాల ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ అల్లం విజయ రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా మోలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ ప్రొఫెసర్ షాగుప్తా షాహిన్, ఎఫ్ బి ఆర్ సి సైంటిస్ట్ డాక్టర్ దీపా జైస్వాల్, గోల్కొండ హోటల్ డైరెక్టర్ చెల్లా శైలజ రెడ్డి, ఇంటర్నేషనల్ ఎయిర్ లైన్స్ పైలెట్ కెప్టెన్ సయ్యదా సాల్వ, ఇండస్ బ్యాంక్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ షిబా చావలి, ప్రముఖ న్యూట్రిషనీస్ట్ డాక్టర్ దీప అగర్వాల్ లు హాజరై తాము ఇంత స్థాయికి ఎదగడానికి క్రమశిక్షణ మూల కారణమన్నారు. నర్సరీ నుండి డిగ్రీ వరకు సెయింట్ ఆన్స్ లోనే విద్యను అభ్యసించడం ఎంతో గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమ తోటి స్నేహితులతో జీవితంలో ఎదురవుతున్న అనుభవాలను పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన గ్రూప్ డాన్స్, ఫ్యాషన్ షో కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అధ్యాపక బృందం పూర్వ విద్యార్థులకు మెమెంటోళ్లు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కళాశాలను స్థాపించి 42 సంవత్సరాల కాలంలో ఎంతోమంది విద్యార్థినిలు చదువుకొని గొప్ప పదవులతో పాటు ఉన్నత స్థానాలలో ఉన్నారని , వారందరినీ ఒకే వేదిక పైకి తీసుకురావడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ విజయ రాణి తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్స్ పుష్పలీల, ఆ్నథోనమ్మ, రాణి ఐక్యా, శ్రీకళ, అనురాధ, ఉషశ్రీ, సుమారెడ్డి, నితీష్ విద్యార్థులుపాల్గొన్నారు.

## వెంకట్రావ్,బాపురావులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి : వెంకట్ బంజారా




అభివాదం చేస్తున్న వెంకట్ బంజారా, లోకేశ్‌నాయక్, రమేష్ నాయక్, రవీంద్రర్‌నాయక్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20,ప్రభాతవార్త:** ఎస్టి జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కుట్రలు, అసత్య ప్రచారాలు చేస్తున్న భద్రాచలం ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపి సోయం బాపు రావును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ బంజార డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రమేశ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్ లతో కలిసి మాట్లాడారు. ఈ మేరకు ఈ నెల 22న సిఎం రేవంత్రెడ్డి ఇంటిముందు నిరసన. దర్నా చేపట్టి. ఆనంతరం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. 1976లో పార్లమెంట్లో చట్టం చేసి బంజారా, లంబాడీ, సుగాలిలను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎస్టి జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం అన్నదమ్ములుగా బతుకుతున్న లంబాడీలు ఆదివాసీలను మధ్య సోయం బాపురావు, తెల్లం వెంకట్రావు చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. లంబాడీలపై జరుగుతున్న ఆసత్య ప్రచారాలపై సీఎం రేవంత్ రెడ్డి, గిరిజన శాఖ మంత్రి సీతక్క స్పందించాలని డిమాండ్ చేశారు. లంబాడీల పట్ల ఇలాగే కుట్రపూరితంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఈసమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఇన్చార్జి రోహిత్ నాయక్, ఉపాధ్యక్షులు భరత్ సుధీర్ చక్రవర్తి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ నాయక్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు వినోద్ నాయక్ తది తరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా, వైద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి




ప్రసంగిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వాన్ని బెదిరిసున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బిఎల్‌పి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు, ఆరోగ్యశ్రీ బకాయిల కోసం ప్రైవేట్ కార్పొరేట్ వైద్య సంస్థలు బకాయిలు చెల్లించాలని లేనియెడల బంధు ప్రకటిస్థామని విద్యార్థులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని బెదిరించడాన్ని చూస్తే ఒక ప్రైవేట్ కార్పొరేట్ మాఫీయా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్నే బెదిరించే స్థాయికి చేరిందని దండి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలు పేద మధ్యతరగతి ప్రజల రక్తం మాంసంలను జలగాల్ల పీల్చి పిప్పి చేస్తున్నాయన దండి వెంకట్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల సగటు ఆదాయంలో తమ పిల్లల చదువు కోసం ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు 60 వైద్యం కోసం 25 ఖర్చులు చేస్తూ మిగిలిన 25 ఆదాయంతో చాలివాలని జీవితాలను వెళ్లదిస్తున్నరని తెలిపారు ప్రజల నుండి విచ్చలవిడిగా ఫీజుల పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు, వైద్య ఖర్చుల పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ వైద్య సంస్థలు లక్షల కోట్ల రూపాయలు దండుకోని ప్రభుత్వ వ్యవస్థలనే సవాల్ చేస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థల ఆదాయ, ఖర్చుల పై ప్రజా ఆడిట్ జరపాలని, ఎంపీ , ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలను ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని నడపకూడదని చట్టం చేయాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర బడ్జెట్ లో 30 నిధులు కేటాయించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వైద్య సంస్థల మాఫియా ను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఏకేవై ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**- మంత్రి వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్.**



రాజీవ్‌నగర్ గ్రౌండ్‌లో ఉచిత కళ్లజోడ్లు పంపిణి చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించటం అభినందనీయమని జూబ్లీహిల్స్ నియోకవర్గం ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం రాజీవ్‌నగర్ గ్రౌండ్‌లో ఏకేవై ఫౌండేషన్, మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్‌కుమార్ యాదవ్ తన సొంత ఖర్చులతో పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు దాదాపు 12 వందల మందికి కళ్లద్దాలను అందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్‌లు పాల్గొని కళ్లజోడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా పేద ప్రజలకు చేయూతను అందించడానికి స్వచ్ఛంద సంస్థలు స్థానిక సంక్షేమ సంఘాలు ముందుకు రావాలన్నారు. అంజన్‌కుమార్ యాదవ్ చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎంతగానో ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే అజారుద్దీన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్, నిజాముద్దీన్, మురళీగౌడ్, అంజయ్యగౌడ్, కల్యం శ్రీనివాస్‌రెడ్డి, మసిన్‌కురేసి, ఎర్రకృష్ణ కుమార్, దూడల రవీగౌడ్, బీ.అశోక్ పాల్గొన్నారు.

## సహజీవనం చేసిన యువకుడే హంతకుడు!

**కుషాయిగూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త..** చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఈనెల 17న మహిళను అతికిరాతకంగా హత్య చేసి మూట కట్టి రైల్వే స్టేషన్ ముందు చోటుచేసుకున్న తీవ్ర సంచలనం రేపిన సంఘటనలో చర్లపల్లి రైల్వే పోలీసులు చర్లపల్లి పోలీసులు నిందితున్ని సిసి పోటేజీల ద్వారా గుర్తించినట్లు సమాచారం. నిందితుడు, అర్చక గురైన మృతురాలు ఇద్దరూ పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన వారిని తేలింది. పశ్చిమబెంగాల్ ప్రాంతానికి చెందిన నిందితుడు సంజయ్ మృతురాలు ప్రమీల ఇద్దరు జీవనోపాధి కోసం నగరానికి వరుస వచ్చి నార్సింగ్ నాన్నకు రామ్ గూడ ప్రాంతంలో లేబర్గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య పరిచయం పెరిగింది. పరిచయం కాస్త సహజీవనానికి దారితీసింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు సహజీవనం సాగిస్తున్నారు. కాగా ఇద్దరి మధ్యలో గత కొంతకాలంగా గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మృతురాలు ప్రమీలపై అనుమానం పెంచుకున్న సంజయ్ ఈనెల 17 బుధవారం ప్రమీలను నార్సింగ్ ప్రాంతంలోనే అతి దారుణంగా హత్య చేసి గోనెసంచిలో వేసుకొని 37 కిలోమీటర్ల దూరం ఆటోలో ప్రయాణించి చివరకు చల్లపల్లి రైల్వే స్టేషన్ చేరుకొని ప్లాట్పారం నెంబర్ 5 వద్ద మృతురాలి శవాన్ని వదిలేసి చల్లపల్లి రైల్వే స్టేషన్ కు ప్లాట్ఫార్మ్ నెంబర్ 5 ద్వారా లోపలికి వెళ్లి వెస్ట్ బెంగాల్ ట్రైన్ ఎక్కినట్లు సమాచారం. సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడి ఫోటోలను గుర్తించగలిగారు. పోలీసులు అధికారికంగా వివరాలు తెలపాల్సి ఉంది.

## జిహెచ్‌ఎంసి,హైడ్రా అధికారులు హడావిడి తప్ప చేసింది ఏమి లేదు : ఎమ్మెల్యే తలసాని



గాయిత్రి నగర్‌లో ముంపుకు గురైన ప్రాంతంలో వివిధ అధికారులతో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలుఇబ్బందులకు గురి కావాలా అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కుసషిన బారీ వర్షాలతో ముంపునకు అమీర్‌పేట డివిజన్‌లో గాయిత్రి నగర్‌లో శనివారం వివిధ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీఓ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నాలా మోడలింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలాపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలిగించాలని ఆదేశించారు. ఆక్రమణలను అడ్డుకోకుంటే భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదురౌతాయని అధికారులకు స్పష్టం చేశారు. నాలాపై అక్రమణలను తొలగించాలని గతంలో చెప్పినప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల కురిషిన వర్షం వలన గాయిత్రి నగర్ పెద్ద మొత్తంలో ముంపునకు గురైందని, ఆర్థికంగా చాలా నష్టపోయినట్లు స్థానికులు ఎమ్మెల్యేకు వివిరించారు. సంవత్సరాలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాలా పనులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతుందని, వర్షం కురిస్తే తమకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. నాలా పనులు అసంతృప్తిగా ఉన్న ఎగువన ఉన్న నాలాల నుండి కిందకు కిందకు నీటి విడుదల చేసిన కారణంగా కాలనీ మొత్తం తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అధికారుల మధ్య సమన్వయం లేక పోవడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టక పోవడం వల్లనే పనులు జాప్యం జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న నాలాలో పూర్తి స్థాయిలో పూడిక తొలగించేలా చర్యలుత తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వచ్చి పర్యటించిన వెళ్లిన ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. జిహెచ్‌ఎంసి హైడ్రా అధికారులు వచ్చిన హడావుడి తప్పా చేసింది ఏమి లేదన్నారు. నగరంలోని నాలాల్లో పూడికత తొలగిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికి నాలాల్లో మాత్రం ఆనవాళ్ళు కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్‌నామన శేషుకుమారి, డిసి.జయంత్, టౌన్ ప్లానింగ్ ఏసిపి మాన్‌సూరు, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, వాటర్‌వర్క్స్‌డిజిఎం శ్రీనివాస్‌లు స్ట్రీట్ లైట్ డిఈ దీప్తి, డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు హన్మంతరావ్,సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్,ప్రవీణ్‌రెడ్డి, పీయూషుగుప్త, వనం శ్రీనివాస్, కట్టా బలరాం, సత్య నారాయణ, బాసా లక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మి, కాలనీ వాసులు రాజు, నర్సింహ్మా,వినోద్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రోత్సావాలకు ముస్తాబైన శ్రీసంగమేశ్వర శ్రీవేంకటేశ్వరస్వామివార్ల దేవాలయం

**నాంపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న సుప్రసిద్ధ అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయం శ్రీ దేవీ శరన్నవ రాత్రోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 22 సోమవారం నుండి అక్టోబరు 2 గురువారం వరకు దేవాలయంలో వేంచేసియున్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకురాలైన పార్వతీ అమ్మవారికి అత్యంత వైభవోపేతంగా నవరాత్రోత్సవాలు జరపనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ బి.సి.వెంకటేశ్వరరావు, అర్చకస్వాములు తెలిపారు. ఈ శరన్నవరాత్రోత్సవాల్లో ప్రతీరోజూ ఉదయం 5గంటలకు అమ్మవారి అభిషేకం; 9గంటలకు అమ్మవారి అలంకార దర్శనం; 10గంటలకు అమ్మవారి హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన; మధ్యాహ్నం 12గంటలకు మంగళ హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ; రాత్రి 6.30గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని వారు పేర్కొన్నారు. అమ్మవారి దివ్య అలంకారములలో భాగంగా 22 సోమవారం శ్రీ బాలాత్రిపురసుందరి దేవి; 23 మంగళవారం శ్రీ గాయత్రిదేవి; 24 బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవి; 25 గురువారం శ్రీ లలితదేవి; 26 శుక్రవారం శ్రీ మహాలక్ష్మిదేవి; 27 శనివారం శ్రీ వైష్ణోదేవి; 28 ఆదివారం శ్రీ మంగళగౌరిదేవి అలంకారముతోపాటు ఉదయం 9గంటల నుండి లక్ష పుష్పార్చన; 29 సోమవారం శ్రీ సరస్వతీదేవి; 30 మంగళవారం శ్రీ దుర్గాదేవి అలంకారముతోపాటు ఉదయం 9గంటల నుండి చండీహోమము; అక్టోబరు 01 బుధవారం శ్రీ మహిషాసురమర్ధిని; 02 గురువారం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారముతోపాటు ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, రాత్రి 6గంటలకు శమీపూజ కార్యక్రమాలు ఉంటాయని పి.లక్ష్మారెడ్డి వివరించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాది కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి పార్వతీ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

## వర్గీకరణ చట్టాన్ని సవరించాలి : మాల జె.ఎ.సి



బిఆర్ఎస్ మాజీ మంత్రి కె.టి.ఆర్‌ను కలిసిన వినతిపత్రం అందచేసిన మాల జె.ఎ.సి

**బేగంబజార్,సెప్టెంబర్ 20ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆశాస్త్రీయంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణతో 40లక్షల మంది మాలలు నష్టపోతున్నారని,వారికి న్యాయం జరిగే విధంగా అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.టి.ఆర్‌ను కలిసి తెలంగాణ మాల సంఘాల జె.ఎ.సి వినతి పత్రం అందచేసివిజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జె.ఎ.సి చైర్మన్ డాక్టర్ మందాల బాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్,గౌరవ అధ్యక్షులు చెరుకు రాంచందర్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణశాస్త్రీయకంగా లేదని,ఆశాస్త్రీయంగా ఉందన్నారు. దీంతో వర్గీకరణ మూలంగా మాలలకు విద్యా,ఉద్యోగల్లోతీవ్రంగా నష్టం జరుగుతుదన్నారు.గణాంకాలతో కెటిఆర్‌కు విన్నవించారు. మాల సమాజానికి చెందిన మంత్రులు బట్టివిక్రమార్క, వివేక్,స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు ఎఐసిసి అధ్యక్షుడుమల్లికార్జున్ ఖర్గే,కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించాలన్నారు.లేని పక్షంలోమాలల హక్కులను భంగం కలిగించిన వారవుతారన్నారు.అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీయాలని డిమాండ్ చేశారు.మాలసంఘాల ప్రతినిధులు బాలకృష్ణ,బేగరిదేవదాస్, బి.వీరస్వామి, మాదాసు రాహుల్‌రావు,టి.రవి,నరసింహయ్య పాల్గొన్నారు.

## గుజరాతీ కళాశాలలో చిత్రలేఖనం

**అఫ్జల్‌గంజ్,సెప్టెంబర్ 20ప్రభాతవార్త :** సేవా పక్షంలో భాగంగా భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో బ్యాంకు స్ట్రీట్‌లోని గుజరాతీ కళాశాలలో చిత్రలేఖనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా చిత్రలేఖనంలో పాల్గొన్ని చిత్రలేఖనం చేశారు.ఈకార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా, వివేక్,శ్రీకాంత్, కావ్య, కల్పన, భారతీ,స్వప్న,మల్లేష్,కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాలికలు క్రమశిక్షణ,పట్టుదలతో చదవాలి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** సమాజంలో స్త్రీ పాత్ర చాలా గొప్పదని,బాలికలు మంచి సంస్కారం,క్రమ శిక్షణతో చదువు కుంటే ఉన్నత రంగాలలో తప్పకుండ రాణిస్తారని దూద్‌బౌలి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు.దూద్‌బౌలిలోని ఆశ్రిత హోంలో జరిగిన సిబిసిపి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బాలికలు బాల్యం నుంచి మంచి అలవాట్లతోమెలిగి పట్టుదలతో చదువు కోవాలని తెలిపారు.ఆశ్రిత హోం ప్రోగ్రాం మేనేజర్ వి.పర్వతాలు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు ఆశ్రిత హోంలో ఉంటున్నారని, బాగా చదువుకుని నేడు ఎంతో మంది ఉన్నత రంగాలలో రాణిస్తున్నారని తెలియజేశారు.బాల్య వివాహాలపై ప్రజలలో చైతన్యం కలించటానికి పలు కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. ఆశ్రిత కమ్యూనిటి సోషల్ వర్కర్ మాధవి మాట్లాడుతూ పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వి.పర్వతాలు ఆశ్రిత హోం ప్రత్యేక ఇంఛార్జి శిరీష,శేఖర్,కో ఆర్డినేటర్ శేఖర్ రామస్వామి,కౌన్సిలర్ అనిత, ఉపాధ్యాయురాలు శివమ్మ,బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగలు తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకలు

**-ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్**



చిక్కడపల్లి లోని సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న ముషీరాబాద్ ఏంఎల్ఏ ముఠా గోపాల్

**చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మన సంస్కృతి సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకలుగా నిలుస్తాయని ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ అన్నారు. శనివారం చిక్కడపల్లి లోని సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ప్రముఖ విద్యావేత్త, న్యూ ఎరా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా గోపాల్ విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో పాటు కోలాటం ఆడారు. మన సంస్కృతి , సంప్రదాయాలకు బతుకమ్మ పండుగలు నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ యువనేత ముఠా జయసింహ, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలి

**-నల్లకుంట పోలీసుస్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్**



నల్లకుంట ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్‌ను సత్కరిస్తున్న అడిక్‌మెట్ బిజెపి డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, రొయ్యూరు శేషసాయి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని నల్లకుంట పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ మారుతి ప్రసాద్ కోరారు. శనివారం నూతన ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన మారుతి ప్రసాద్ ను అడిక్ మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. సాయి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ శాంతిభద్రల పరిక్షల కోసం బిజెపి పార్టీ పరంగా కృషి చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్ శేష సాయి, నగర నాయకులు కౌండిన్య ప్రసాద్ కిషోర్ జగదీష్ సంఘం బాలరాజ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్

**మైలార్‌దేవ్‌పల్లి,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టిఎన్‌జిఓఎస్ కాలనీలో 48 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైనీ పైప్ లైన్ పనులను శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్‌ఎంసి,వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలకల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు.కార్యక్రమంలో బుచ్చిరెడ్డి,నరసింహారెడ్డి,చందూ నాయక్,రమేష్ రెడ్డి,మన్మోహన్ రెడ్డి,తలారి చిన్న,శ్రీ కాంత్ రెడ్డి,శంకర్ రెడ్డి,రాజేష్,అనిల్ రెడ్డి,భవానీ,జిహెచ్‌ఎంసి,జలమండలి అధికారులు పాల్గొన్నారు.

## కాలాపత్తర్ రౌడీ షీటర్ మహ్మద్ అసద్ నగర బహిష్కరణ

**చార్మినార్,సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** హత్య,దాడి, హత్యాయత్నం,క్రిమినల్ బెదిరింపులతో పాటు 11 క్రిమినల్‌కేసుల నేర చరిత్ర కలిగి ఉన్న హైదరాబాద్ పాతబస్తీ కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ అసద్ అలియాస్ అసద్ (27) హైదరాబాద్ నగర బహిష్కరణకు గురియ్యాడు. పాతబస్తీ బిర్యానీ షా టేకిరి ప్రాంతానికి చెందిన మహ్మద్ అసద్ కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ రౌడీ షీటర్.రౌడీ షీటర్ మహ్మద్ అసద్ 2024వ సంవత్సరం అక్టోబరు నెలలో శాలిబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సిమ్లాన్ అనే రౌడీ షీటర్‌ను హత్య చేశాడు. హత్య,దాడి, హత్యాయత్నం,క్రిమినల్ బెదిరింపులు,బలవంతపు వసూళ్లు,అక్రమంగా ఆయుధాలను కలిగి ఉండటం వంటి నేరాలతో సహా 11 కేసుల నేర చరిత్ర రౌడీ షీటర్ మహ్మద్ అసద్‌పై ఉంది.కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా సమర్పించిన రికార్డులను పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ పరిశీలించారు.స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చట్ట విరుద్ధ కార్యాకలాపాలలో పాల్గొంటున్నందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్,1348 ఫస్లీ, సెక్షన్ 26(1) నిబంధనల ప్రకారం రౌడీ షీటర్ మహ్మద్ అసద్‌కు నోటీసులు జారి చేశారు.హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి రౌడీ షీటర్ అసద్‌ను ఒక సంవత్సరం పాటు బహి ష్కరణ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాలు జారీ చేశారని కాలాపత్తర్ సిఐ మహ్మద్ ఖలీల్ పాషా వెల్లడించారు.

## ప్రజలను వంచించటానికే ఫ్యూచర్‌సిటీ : సాయిబాబా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** ప్రజలను వంచించటానికే ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కొత్త నాటకానికి తెరలేపిందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చినుకుపడితే నగరం అతలాకుతలమై, సామాన్య ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని బతుకుతూ ఉంటే పట్టించుకోలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అంటూ ప్రజల ను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. నగర శివారులలో భూములన్నీ ఫ్యూచర్ సిటీ పేరుతో కబ్జా చేసుకుని, తమ బంధువులకు, అధికార పార్టీ అనునాయులకు కట్టబెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. నాలాలో నలుగురు వ్యక్తులు కొట్టుకుపోతే పరామర్శించే తీరిక కూడా ఈ మంత్రులకు లేదా అని ప్రశ్నించారు. నాలాలో కొట్టుకుపోయిన ప్రాణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్లు పెంచాలి



కార్పోరేటర్ రచనశ్రీకి వినతిపత్రం అందచేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్లు పెంచాలని విహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాలమేరకు శనివారం విహెచ్‌పీఎస్, సిపిహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీని కలసి, వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ 4 వేల నుండి 6వేలకు, వృద్ధులు, వితంతువుల పెన్షన్‌లు 2వేల నుండి 4 వేలకు తెలంగాణ ప్రభుత్వం పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు బొట్టు మహేష్‌మాదిగ, విహెచ్‌పీఎస్ సీనియర్‌నాయకులు కోపల్లి రమేష్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్‌మాదిగ, సీనియర్ నాయకులు కలవల కుమారస్వామి మాదిగ, బీజేపీ నేతలు పరిమళమాదిగ, బీజేపీ దళిత మోర్చా నాయకులు వెంకటేష్,చంద్రయ్య,సోమయ్య పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీ విజయ దుర్గ నగర్ కాలనీ (జిపిఆర్ లేఔట్)లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన సానుకూలంగా స్పందించి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా రూ.38 లక్షల సీసీ రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించారు. మంజూరైన నిధులతో శనివారం కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి, 2వ డివిజన్ అధ్యక్షులు సురగాని వీరబాబు గౌడ్, కమిటీ అధ్యక్షులు అంబారెడ్డి వంగల, రాకేష్ రెడ్డి సంకెపల్లి, మురళి, రవీందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్ది నారాయణరెడ్డి, రవీందర్ రెడ్డి, మెడ వెంకట్, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, తిజు రెడ్డి, విజయ్ కుమార్,సందీప్ రెడ్డి, హరీష్, జెగ్గా మధుసూదన్ రెడ్డి, సురేందర్ కుమార్, గూడూరు మురళి కృష్ణ, సుబ్రహ్మణ్యం (సుబ్బు), యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : కూన శ్రీశైలం గౌడ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కూన శ్రీశైలం గౌడ్

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఈగ కిష్టయ్య, ఈగ రమ, మాదాస్ విజయ, పరుశ బాలమల్లేశ యాదవ్, రూపావతి సాసుపల్లి, యేశాల కృష్ణవేణి, సింగిరెడ్డి రమాదేవిలకు సిఎం సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సహాయాన్ని శనివారం శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్ఆఫ్ నిరుపేదలకు అండగా మారిందాన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, పెద్ద అంజి యాదవ్, బాలకృష్ణారెడ్డి, ఆరిఫ్, మక్బుల్ బాయ్, సురేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి దేవస్థానంలో 22 నుండి నవరాత్రి మహోత్సవాలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

నిజాంపేట్, జర్నలిస్ట్ కాలనీలో సెప్టెంబర్ 22నుండి అక్టోబర్ 2వరకు దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. సెప్టెంబర్ 22న శ్రీ బాలా త్రిపురసుందరి దేవిగా, సెప్టెంబర్ 23న శ్రీ గాయత్రీ దేవిగా, సెప్టెంబర్ 24న శ్రీ అన్నపూర్ణా దేవిగా, సెప్టెంబర్ 25న శ్రీ కాత్యాయని దేవిగా, సెప్టెంబర్ 26న శ్రీ మహాలక్ష్మీ దేవిగా, సెప్టెంబర్ 27న శ్రీ లలితా త్రిపురసుందరి దేవిగా, సెప్టెంబర్ 28న శ్రీ మహాచండీ దేవిగా, సెప్టెంబర్ 29న శ్రీ సరస్వతి దేవిగా, సెప్టెంబర్ 30న శ్రీ దుర్గాదేవిగా, అక్టోబర్ 1న శ్రీ మహిషాసుర మర్ధిని దేవిగా, అక్టోబర్ 2న శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## 22 నుంచి మహంకాళీ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

**-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు : ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి**



విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈ ఓ ,ఫౌండర్ ఫ్యామిలీమెంబర్లు.

**బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని,ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈ ఓ.ఫౌండర్ ఫ్యామిలీమెంబర్‌తో కల్సి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ ఓ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వతేది వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈ తెలిపారు.ప్రతి రోజు అమ్మ వారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆయన తెలియజేసారు.ప్రతి రోజు ఉదయం గం 9.30లకు అలంకారం దర్శనం ఉంటుందని చెప్పారు. 22న బాలత్రిపుర సుందరీదేవి,23న గాయత్రీదేవి,24వతేదీ రాజరాజేశ్వరీదేవి,25వతేదీన అన్నపూర్ణాదేవి,26న గజలక్ష్మి దేవి,27వతేదీ భవానీదేవి,28న తేదీన చండీదేవి అలంకారం, 29న సరస్వతీదేవి,30న దుర్గాదేవి,అక్టోబరు 1న మహిషాసుర మర్ధినీదేవి,2న మహాకాళీదేవి అలంకారం దర్శనం ఇవ్వనున్నట్లు తెలియజేసారు.ప్రతి రోజు అభిషేకాలు, కుంకుమార్చన,చండీహోమం తదితర పూజలు జరుగుతాయన్నారు. 30వ తేదన దేవాలయ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.ప్రతి రోజు సాయంత్రం గం 6ల నుంచి దేవాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక.ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## బిసి రిజర్వేషన్లే లక్ష్యంగా 24న బిసి బతుకమ్మ : జాజుల శ్రీనివాస్‌గౌడ్



బిసి బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజులశ్రీనివాస్‌గౌడ్, మణిమంజరి, తారకేశ్వరి, సంధ్య, శ్యామల, గౌతమి, వరలక్ష్మి తదితర నాయకురాల్లు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త** : రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని, అలాగే మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 24న హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద వేలాదిమంది మహిళలతో పెద్దయెత్తున బిసి బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈమేరకు రవీంద్ర భారతిలో బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణి మంజరి ఆధ్వర్యంలో 24న హైదరాబాద్‌లో జరగనున్న బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసిలకు విద్య ఉద్యోగ రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచాలని 22 నెలలుగా బిసిలు పోరాటం చేస్తున్నా కేంద్రప్రభుత్వం దిగిరావడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసినా కేంద్రం తొక్కిపెట్టిందని ఆరోపిస్తూ రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ బిసి వ్యతిరేక వైఖరి విడనాడి మనస్సు మారాలని బతుకమ్మ పండుగను బిసి మహిళలు వేదికగా చేసుకొని పోరాదుతున్నారని ఆయన అన్నారు. బి.మణి మంజరి మాట్లాడుతతూ ఈ బతుకమ్మ వేదికగా మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి మహిళా సంఘాల నేతలు తారకేశ్వరి, సమత, సంధ్య, సుజాత, శ్యామల, గౌతమి, వీణదేవి, రాజేశ్వరి, శైలజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా 'బతుకమ్మ సంబురాలు'



'బతుకమ్మ సంబురాలు' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, శ్రవంతి సగర తదితరులు

**సైఫాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ నెల 24వ తేదీ సాయంత్రం ట్యాంక్‌బండ్ మీదగల బతుకమ్మ ఘాట్ వద్ద 'బతుకమ్మ సంబురాలు' ఘనంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ సగర మహిళా సంఘం తెలిపింది. ఈ మేరకు ఈ సంబురాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల శ్రవంతి సగర తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంబురాల్లో జంటనగరాల్లో సగర మహిళలేకాకుండా రాష్ట్ర నలుమూలల సగర మహిళలు వేలాది మంది పాల్గొంటారని చెప్పారు. ఎన్నో ప్రాజెక్టులు, భవనాలు, కట్టడాల నిర్మాణంలో భాగస్వాములైన సగరులను ప్రభుత్వాలు, సమాజం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సగరులను సమాజంతోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలనే ఉద్దేశ్యంతోనే ప్రతి ఏడాది ట్యాంక్‌బండ్‌పైన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ తదితరులు పాల్గొంటారని వారన్నారు. సగరులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి బిసి డి గ్రూప్‌లో ఉన్న ఉన్న వీరిన బిసి ఏ గ్రూప్‌లోకి మార్చాలని, మైనార్టి మహిళలకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలు 50 వేలు, లక్ష రూపాయలు, సగర మహిళలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుందారం గణేషాచారి, మణిమంజిరి, రవి సగర, హరికిషన్ సగర, సత్యం సగర తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంట ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి : వి.హనుమంతరావు



బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి రావాలని బతుకమ్మలతో గోల్నాకలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో పోలినేని పద్మ రామ్మోహన్ రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**

బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి రాజకీయాలకు అతీతంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు పిలుపు నిచ్చారు. శనివారం గోల్నాక డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలినేని పద్మ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బతుకమ్మలతో ఇంటింటికి వెళ్లి బతుకమ్మకుంట ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గత 35 ఏళ్లుగా కబ్జాలో ఉన్న బతుకమ్మకుంటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహకారంతో తిరిగి దక్కించుకున్నామని. బతుకమ్మకుంటలో బతుకమ్మ ఆడే విధంగా ఏర్పాట్లు అన్ని చేశామని చెప్పారు.పార్టీ సీనియర్ నాయకులు పోలినేని పద్మ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వి.హనుమంతరావు పోరాటం ఫలితంగా బతుకమ్మకుంట దక్కిందని, బతుకమ్మకుంటకు వి.హనుమంతరావు పేరు పెట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, నారాయణస్వామి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, తొలుపునూరి కృష్ణగౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కిషన్, లక్ష్మణ్, అజయ్‌కుమార్ మహిళా నాయకురాలు విజితా రెడ్డి, శాంతమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను ఉపయోగించుకోండి : మాజీ కార్పొరేటర్



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సురేష్ రెడ్డి

**జీడిమెట్ల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

సుభాష్ నగర్ డివిజన్‌లో స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని సూరారం కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తు, మహిళలు పిల్లలు అందరు వినియోగించుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి కోరారు. ఈసందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరాల్లో గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. మహిళలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరనాజ్, స్పెషలిస్ట్ డాక్టర్ అంజలి మాధురి, ల్యాబ్ టెక్నీషియన్ బి రమేష్, ఫార్మసిస్ట్ నవీన్, ఏఎన్ఎం రాజేశ్వరి, మహిళలు స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఎల్లవేళలా కృషి : మైనంపల్లి హనుమంతరావు



మైనంపల్లి హనుమంత రావును సన్మానిస్తున్న ప్రజలు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌లోని వుడ్ కాలనీ, వైష్ణవి అపర్ణ కాలనీలకు డ్రైనేజీ, రోడ్లు మంజూరు చేయించి నందుకు వారి కాలనీలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రవీందర్ గౌడ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు...



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న అధ్యాపకులు.

**బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త**

బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా విద్యార్థులకు,అధ్యాపకులకు,కార్యాలయ బృందానికి బతుకమ్మ పోటీలు నిర్వహించారు.బతుకమ్మ స్ఫూర్తిని విద్యార్థులు, అధ్యాపకులు కొనసాగించారు అని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పద్మావతి ప్రశంసించారు.సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కరరెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.అనీషెరాన్ పరిక్షల విభాగాధిపతి డా.పుష్ప,పరిపాలనా విభాగం అధిపతి దివేశ్ శుక్లా,సూపరిండెంట్ విమల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## కొలన్ హన్మంత్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ వాసులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. నిజాంపేట్ కార్పొరేషన్ మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా ఆధ్వర్యంలో 100 మందికి పైగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

## వెంకటరావు పేట్ బస్తీ సమస్యలు పరిష్కరిస్తాం: కార్పొరేటర్



బస్తీ పర్యటనలో కార్పొరేటర్

**అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**

బస్తీ వాసులు సమస్యలు పరిష్కారానికి చిత్త శుద్దితో పని చేస్తున్నామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని వెంకటరావు పేట్‌లో అధికార యంత్రాంగంతో కలిసి పర్యటించారు. డబుల్ బెడ్ రూము ఇళ్ళు, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ లీకేజీలు, బోర్‌వెల్ తదితర సమస్యలను బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. సమస్యలను అతి త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని శాంతి శ్రీనివాస్ రెడ్డి హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇ వరుణ్, జలమండలి శేఖర్ నేతలు ప్రేమ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్‌సికి వీధి వ్యాపారుల వేడుకోలు



జడ్‌సికి వినతి పత్రం అందిస్తున్న వ్యాపారులు

**అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రోడ్డుపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను వెళ్లి పోవాలని ఆదేశాల జారీ చేయడం ఎంత వరకు సమంజసమని వెంకటాపురం డివిజన్‌కు చెందిన వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూదేవినగర్ పార్కు వద్ద తోపుదు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న వారిని జీహెచ్ఎంసి ఇటీవల ఖాళీ చేయాలని హుకూం జారీ చేసింది. ఈ నేపథ్యంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత అనీల్ కిషోర్ ఆధ్వర్యంలో వ్యాపారులు శనివవారం జడ్‌సి అపూర్వ్ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. రోడ్డు జీవనాదరంగా ఉన్న వారు ఎక్కడికి వెళతారని ప్రత్యామ్నాయం చూపించాలని జడ్‌సిని అనీల్ కిషోర్ కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, శివ, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అందించిన పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలిః మాగంటి సునీత

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :**

ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించిన సంక్షేమ పథకాలే రాబోయే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు దోహదపడతాయని రహమత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ షఫీ అన్నారు. శనివారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహ్మద్ అబ్దుల్ షఫీ ఆధ్వర్యంలో డివిజన్ బూతు కమిటీ సమావేశం ముఖ్య అతిథిగా దివంగత శాసనసభ్యులు మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో 75 బూతులు ఉన్నాయని దాదాపు 72 వేల 138 ఓటర్లు ఉన్నారని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అందించిన పథకాలను నేరుగా ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చాలా వరకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లియాకత్ అలీ, నాగరాజు, కేఎన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, దనూజా, రహీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది పేరుతో మమ్మల్ని మోసం చేశాడు

**తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి బాధితుల విజ్ఞప్తి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:**

తమ వద్ద నుండి డబ్బులు తీసుకొని కేసు వెయ్యకుండా ఇబ్బందులు పెట్టడమే కాకుండా ప్రశ్నించినందుకు తమపైనే దూషణలకు దిగుతూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఒక న్యాయవాదిపై బాధితులు రత్న కుమారి, కొమ్మనాపల్లి గణపతి రావులు ఆరోపించారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్న కుమారి, గణపతి రావు బాధితులు మాట్లాడుతూ తమకు సంబందించిన కేసుల విషయంలో తాను న్యాయస్థానంలో కేసును వాదిస్తానంటూ ఒకన్యాయవాది డబ్బులు తీసుకొని నమ్మబలికాడని, తీరా కేసు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఆయనపై ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ లో ఫిర్యాదు చేస్తే అతని మెంబర్ షిప్ తొలగించారని, ప్రస్తుతం అతను ఎవరికి కనిపించకుండా తిరుగుతున్నాడని, తాము నలుగురం ఇరవై లక్షలు నష్టపోగా, మొత్తం ఆయన బాధితులందరు దాదాపు పది కోట్ల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రమణి,శేషు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన ఆచరణ అమోఘం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్నది ప్రజా ప్రభుత్వమని నిరంతరం ప్రజలకు అందుబాటులో అండగా ఉంటుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ డివిజన్లో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు రమేష్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల ను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇవ్వడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త సాంప్రదాయానికి నాంది పలికిందని అన్నారు. మూతపడిన ఐడియల్ కంపెనీ ఎన్నో ఏళ్లుగా వాటర్ వర్క్స్‌కు సుమారు రూ.40 కోట్లు బాకీ పడిందనీ ఈ కారణంతో కంపెనీలో పనిచేసి రిటైర్ అయిన 170 కుటుం బాలకు వాటర్ వర్క్స్ సంస్థ నీటి సరఫరాను నిలిపివేసిందని సదరు బాధితులు రమేష్‌కి సమస్యను విన్నవించడంతో ఆ యన వాటర్ వర్క్స్ యాజమాన్యంతో మాట్లాడి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వారు రమేష్‌కి వాటర్ వర్క్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, కుక్కల రమేష్, అరుణ్,మ ధు, నర్సింగరావు,శివా చౌదరి రాజేందర్,జ్యోతి, రజని పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రోగులకు మెరుగైన సేవలు



స్వచ్ఛంద సంస్థ అందజేసిన బల్లాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్తః**

గాంధీ ఆస్పత్రిలో చర్మ, సుఖ వ్యాధుల ప్రత్యేక శిబిరం శనివారం ఉదయం ఏర్పాటు చేసిన శిబిరాన్ని డాక్టర్ వాణి ప్రారంభించారు. అనంతరం ఆమే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వారు ఇచ్చిన బల్లలను, స్ట్రెచర్స్ లను పరిశీలించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజల కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆర్.యం.ఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రజని, డాక్టర్ నజీం, డాక్టర్ యోగి,డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సరిత ,డాక్టర్ డాక్టర్ తభసుం, డాక్టర్ శంకర్ ఇతర చర్మ వైద్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్‌వైపు చూస్తున్నాయి



జ్యోతిని వెలిగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**

భారతదేశం అన్నిరంగాల్లో ముందుకు సాగుతోందని, విద్యార్థినీ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్‌వైపు చూస్తున్నాయని, దీనిని గమనించి నూతన ఆవిష్కరణలను శ్రీకారం చుట్టాలన్నారు. శనివారం అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'ఉమంగ్-2కె25 నూతన విద్యార్థులకు ఆహ్వానవేడుక స్థానిక కళ్యాణ లక్ష్మీ గార్డెన్‌లో జరిగింది. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు(అవంతి) మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇచ్చినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ఏ విధంగా కష్టపడాలో సూచించారు. ఎన్‌టివి గ్రూపు సంపదాకుడు, సిఈవో రాజశేఖర్ మాట్లాడుతూ నేటి సమాజానికి ఏంకావో, ఎలాంటి విద్య అవసరం తెలుసుకుని నేర్చుకుంటే నేటి సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బర్కత్‌పుర ప్రిన్సిపాల్ డాక్టర్ రాకేశ్, ప్రత్యేక అతిథిగా ఎఫ్‌టిసిసిఐ సీనియర్ ఉపాధ్యక్షుడు గరిమెళ్ళ శ్రీనివాస్, ఇన్‌ఫోసిస్ ట్రెనింగ్, డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ జి.నిర్మల్‌కుమార్, విద్యాసంస్థల హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ఉపాధ్యక్షుడు ఎంఐఎస్‌ఎస్ నందీశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు నిధులు మంజూరు : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ 7వ వార్డు లాల్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాల అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. వారం రోజుల క్రితం ఈ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేయగా అందులో నెలకొన్న సమస్యలు విద్యార్థుల కోర్కెల మేరకు క్రీడా మైదానం, లాంచ్ చేసేందుకు షెడ్డు ఏర్పాటు, మినరల్ వాటర్ ప్లాంట్, డిజిటల్ క్లాస్‌ల కోసం టీవి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు స్టేజీ వంటి మౌళిక వసతుల ఏర్పాటుకు రూ. 20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, భవాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీచర్లు, విద్యార్థులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.


VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, 13987706Y HAV (MT) HARI KRISHNA ATLURI (RTD) My son name from A HARUN CHOWDARY to ATLURI HARUN CHOWDARY and my daughter's name from A BONITHA CHOWDARY to ATLURI BONITHA CHOWDARY For all Records.

★ I, MOHAMMED ABDUL JAMEEL S/o MOHAMMED FAKRUDDIN, R/o 1/23/425, Bhoodevi Nagar, Alwal, Sec'bad-500015, T.S. Have changed my Daughter's name from M SHIFATHA MEHMOOD To SHAIK SHIFATH MEHMUDA for the purpose of All records.

LOSS OF PASSPORT

★ I, Velgani Suresh Goud S/o. Velgani Kistaiah Goud, H.No:6-1-338/3/2, Padma Raonagar, Sec'bad-25. Passport No: B2684913 issued on 26.09.2000 Expired on 27.09.2010 lost on 05.08.2025 While House Shifting at Padma Rao Nagar. If any one found please Cont: 9963538555

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

క్ర.సం.1, నిట్ నం. ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన నిట్ నం.41/SE (KZ)/GHMC/TA1/2025-26, తేది: 20.09.2025. పనుల యొక్క సంఖ్య: SW డ్రైన్-1, CC-5, మొత్తం సొమ్ము (రూ.లక్షలలో): 385.97, మొత్తం: 6 పనులు: 385.97, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు: బిడ్ దాఖలు ప్రారంభ తేది: 22.09.2025 మ.03.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది: 29.09.2025 మ.03.00 గం. అధికారి యొక్క చిరునామా, సెల్ నం: SE (KZ), GHMC, ఫోన్ నం: 8790522144. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. కమిషనర్, సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (KZ), గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.8410-PP/CL/Advt/1/2025-26, తేది: 20.09.2025

IN THE COURT OF THE HON'BLE PRINCIAL DIST & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR
O.S. No. 328 OF 2025.
BETWEEN:-
1. Chinnam Krishnaveni & others ...Plaintiffs
AND
1. Tahsildar Saroornagar, Ranga Reddy District.
2. All Concerned ...Defendant No.1 & 2
To
All concerned
PUBLIC NOTICE
Whereas the above named plaintiff and five others have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs of Late Ch. Eagaiah @ Ch. Yagaiah the above Plaintiffs are claiming they are the legal heirs of the Late. Ch. Eagaiah @ Ch.Yagaiah. and the matter is posted to 26-10-2025 for any claims or objections from any concerned, you are hereby summoned to appear before this Hon'ble court on 26/10/2025 at 10.30 AM, either in person are through an advocate, failing which the matter will be decided as per law. Hence this notice.
SCHEDULE "A" PROPERTY
All that the House bearing No.3-4-108, admeasuring 311Sq.Yards or Equaling to 260.02 Sq Meters, having plinth area of 470 Sq.Feets with B.T. Roof, situated Bahadurguda Village, Saroornagar Mandal, Ranga Reddy District under L.B. Nagar Municipal Circle, within the Jurisdiction of S.R.O. Saroornagar bounded as follows:- North : Neighbors House. South : 20' Feets Wide Road. East : House No.3-4-107. West : House No 3-4-109. SCHEDULE "B" PROPERTY: All that the House bearing No.3-11-457, consisting of one room having plinth area of 100 Sq.Feets, with ACC, land bearing Plot No.8 (Western Part) admeasuring 438 Sq.Yards or Equaling to 366.21 Sq. Meters, in Sy.No.66/5, situated Mansoora bad Village, Saroornagar Mandal, Ranga Reddy District under L.B.Nagar Municipal Circle, within the Jurisdiction of S.R.O. Saroornagar bounded as follows:- North : Plot No.7. South : Plot No.9. East : Part of Plot No.8 and 5' wide Passage. West : Neighbours Land.
// By Order of the court //
K. SHYAM GOUD
Advocate
Off @ H.No: 3-6-20, 2nd Floor, near Metro Station, L.B. Nagar, R.R.District 500074
Ph: 9848497673

## ఎం.ఎల్.ఆర్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



చెంగిచెర్ల ఎం.ఎల్.ఆర్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎర్పుల మహేష్, కిరణ్ గౌడ్, ఆనంద్,నర్సింగ్ రావు , భాజాపా జిల్లా నాయకులు, తదితరులు

**బోడుప్పల్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త ;**
భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన శుభ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఏర్పుల మహేష్ అధ్యక్షత, కార్యక్రమ ఇంచార్జి జిల్లా నాయకులు రాజా రమేష్, ఆధ్వర్యంలో చెంగిచెర్ల ఎం ఎల్ ఆర్ కాలనీలో స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాసాల నర్సింగ్ రావు యాదవ్, మహిళ మోర్చా రాష్ట్ర నాయకులు కొల్లపూడి విజ య లక్ష్మీ, జిల్లా మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి సంధ్య రెడ్డి, ఈస్ట్ జోన్ ప్రధాన కార్యదర్శి బజారు కిరణ్ గౌడ్ , తుప్పత్ ఆనంద్ , ఉపాదక్షులు శరత్ చంద్ర రెడ్డి, కిషోర్ నాయుడు కార్యదర్శి ధర్మ రాజి రెడ్డి, రచమల్ల చంద్ర శేఖర్ , విజయ రెడ్డి, కాంతా రెడ్డి , బజ్జూరి శ్రీనివాస్ , ఎం ఎల్ ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వరద ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త ;**
139 డివిజన్ పరిధిలోని వరద ముంపు గురైన కాలనీలని రెండో రోజు కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ పర్యటించి తగిన చర్యలు తక్షణమే తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు .ముఖ్యంగా సిఫిల్ కాలనీ మరియు రామచంద్ర ఎంక్లేవ్ కాలనీల లో వరద ముంపు గురైన ప్రాంతాల్ని పర్యవేక్షించి, వర్షాల వల్ల బండ చెరువు ద్వారా వచ్చే వరద నీరు కాలనీలోకి రాకుండా చర్యలు చేపట్టడానికి ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పర్యటించి, వరద నీటి ముంపు నివారించడానికి, అవసరం ఉన్న ప్రదేశాల్లో నాలా వెడల్పు చేయటం, వెంటనే పూడిక తీయించడం, కాలువ ఎత్తు పెంచి రిటైనింగ్ వాల్ నిర్మించడం చేపట్టాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు డివిజన్లోని, ఎన్ఎండిసి కాలనీ, షిరిడి నగర్ , రామచంద్ర ఎంక్లేవ్, వసంతపురి కాలనీ, ప్రశాంత్ నగర్, సత్తిరెడ్డి కాలనీలోని వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఈ ఈ లక్ష్మణ్ , డి ఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మీ,వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తిసీనియర్ నాయకులు బాబు, హరీష్ , కిషోర్ కాలనీ వాసులు జుళీరీ మూర్తి, మారుతీ రావు, విక్రమ్, కృష్ణమూర్తి, రామం, డాక్టర్ మనోహర్, కుమార్ పాల్గొన్నారు.

## ఆర్కె నగర్లో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త ;**
మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ జిహెచ్ఎంసి డిసి సుల్తానా మరియు ఇతర అధికారులతో కలిసి ఆర్కె నగర్ లో ఆకస్మిక పాదయాత్ర చేపట్టారు.గత కొన్ని రోజులగా గ్రీన్ వేస్ట్ ( చెట్ల కొమ్మలు వగైరా ) ఎత్తివేత సగ్రిగ్గా లేదని, కొన్ని ప్రాంతాల్లో శానిటైజషన్ కూడా దెబ్బ తినడానికి మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు.ఈ మేరకు డిప్యూటీ కమీషనర్ సుల్తానా గారిని పిలిపించి ఆర్. కె నగర్ లో పలు చోట్ల వున్నా పరిస్థితిని చూపించారు.ఈ సందర్భంగా ప్రశ్నించిన డి. సి కు సమాధానం ఇస్తూ తమకు కేటాయించిన వాహనాలు రావట్లేదని అందుకే ఎత్తలేకపోతున్నామని హార్టికల్చర్ రాజు అన్నారు. శీనీతి లను పరస్పర మార్పిడి చెయ్యాలని, ఉన్నంతధికారులతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చెయ్యాలని డి. సి కు శ్రవణ్ సూచించారు.తదుపరి ఇంజనీరింగ్ సిబ్బంది తో కలిసి సర్దార్ పటేల్ నగర్ నూతన పవర్ బోరెవెల్ కొరకు సర్వే చేశారు.కార్యక్రమం లో ఏ. ఈ నవీన్,ఎస్ఎఫ్ఎ గిరి, చెన్నారెడ్డి, బాబీ, నర్సింహా, నాని, భరత్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కార్పొరేటర్



ముసారంబాగ్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవాపక్ష కార్యక్రమాలలో భాగంగా ముసారాంబాగ్ డివిజన్ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని మూసారంబాగ్ డివిజన్ లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొక్క మధు సుధన్ రెడ్డి, బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, నాయకుడు రమేష్ రెడ్డి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

## గుండె సంబంధిత వ్యాధిగ్రస్తునికి సబితారెడ్డి అండ



ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

**సరూర్నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మీర్పేట్ కార్పొరేషన్ 16 వ డివిజన్ తిరుమలనగర్కు చెందిన నారాయణగౌడ్ వైద్య చికిత్సల కోసం మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రూ.2 లక్షల ఎల్ఓసిని మంజూరు చేశారు. ఈ మేరకు ఎల్ఓసికి సంబంధించిన పత్రాలను శనివారం క్యాంపు కార్యాలయంలో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్కుమార్ యాదవ్, అర్కల కామేష్రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో లక్ష్య సాధన కోసం కృషి చేయాలి : చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి



ప్రగతి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలలో పాల్గొన్న కళాశాల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ పి. రామ్ రెడ్డి, సీతారాంరెడ్డి, ప్రిన్సిపల్ టి. చిన్నారెడ్డి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదల, దృఢ సంకల్పం, అంకితభావంతో తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని ప్రగతి డిగ్రీ కళాశాల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ ప్రగతి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే ఉద్భవ్ 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డైరెక్టర్లు డాక్టర్ పి. రామ్ రెడ్డి, సీతారాంరెడ్డి, ప్రిన్సిపల్ చిన్నారెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆదునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధిస్తున్నామని పేర్కొన్నారు .విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి తమ కళాశాలలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి. రామ్ రెడ్డి, సీతారాం రెడ్డి, ప్రిన్సిపాల్ టి. చిన్నారెడ్డి, సిబ్బంది జయ చందర్, సుకన్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో కార్పొరేటర్ రజిత పరమేశ్వర్రెడ్డి పర్యటన



ఉప్పల్ స్వరూప్నగర్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్రెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** ఉప్పల్ స్వరూప్ నగర్ కాలనీ శనివారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్లో పలు అభివృద్ధి పనులతోపాటు, పెండింగ్లో ఉన్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్లోని పలు కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు. కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్కు విన్నవించారు. దీంతోపాటు డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందనే విషయాన్ని రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి వివరించారు. స్వరూప్ నగర్ కాలనీలో సిసి రోడ్డు తో పాటు డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్వరూప్ నగర్ కాలనీలో సిసి రోడ్డు తోపాటు, డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలను చేపట్టనున్నట్టు కార్పొరేటర్ ఎం. రజితరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్రెడ్డి, ఇంజనీర్ హరి లాల్, జలమండలి అధికారి సత్యనారాయణ, డిఈ వెన్నెల గౌడ్, శానిటేషన్ డిఈ చందన, ఎఇ రాజ్ కుమార్,స్వరూప్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, సిద్దేశ్వర్ రావు, పిసాటి అంజి రెడ్డి,ఎం.మోహన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్,సంతోష్,సత్యనారాయణ,నరేష్,జ్ఞానేశ్వర్ గుప్తా,ఆనంద్ ప్రభు ,భాస్కర్ రెడ్డి, పూజారి హనుమంతు తదితరులు పాల్గొన్నారు

## పెన్షన్దారుల, వికలాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



**మల్కాజిగిరి సెప్టెంబర్.20.ప్రభాతవార్త :**
ఎన్నికల ముందు అబద్ధాల వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెన్షన్ దారులకు, వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4000 నుంచి 6,000 , 2000 నుంచి 4000 రూపాయలను అర్హుల ప్రకారం అందించాలని ప్రభుత్వాని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్,విహెచ్పి ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ కార్యదర్శులకు మున్సిపాలిటీలలో కౌన్సిలర్లకు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లకు వినతి పత్రాన్ని అందించే కార్యక్రమంలో భాగంగా వీహెచ్పీఎస్, ఎంఆర్పిఎస్ నాయకులు కార్పొరేటర్ ను వారి కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ ఏ తప్ప ఈ ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం అమలు చేయడం లేదని ఎన్నికల ముందు హామీని ఇచ్చి ఇప్పుడు వికలాంగులకు పెన్షన్ దారులకు పెన్షన్ అందించే విషయంలో స్పందించడం లేదని ఈ విషయంపై ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నాయకుల ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ఈ విషయాలను అధిష్టానం చెప్పాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతుందని చెప్పారు.మీరు చేస్తున్న ఉద్యమాన్ని మా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి మా వంతు సహకారాన్ని పెన్షన్ దారులకు, వికలాంగులకు న్యాయం జరిగే విధంగా,సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మమాదిగ,జాతీయ నాయకులు ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, ఎం జె ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్,మేడ్చల్ జిల్లా విహెచ్పిఎస్ అధ్యక్షులు వినయ్,నాయకులు కే బి జె హరి,పి రాములు,సోను, నరసింహ,రాములు యాదవ్, రమాదేవి, జ్యోతి కీర్తి,ఎన్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## గత బిఆర్ఎస్ పాలనలో మంజూరైన స్పెషల్ ఫండ్ను విడుదల చేయండి

### కాంగ్రెస్ సర్కార్కు సబితా ఇంద్రారెడ్డి డిమాండ్



లెనిన్నగర్ మురికివాడలో డ్రైనేజీ బురద నీటిలో పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలను పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మంజూరైన స్పెషల్ డెవలప్మెంట్ (ఎస్డిఎఫ్) నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆమె నియోజకవర్గంలోని మీర్పేట్ కార్పొరేషన్ 35వ డివిజన్లో పర్యటించి దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ ఔట్లెట్ సమస్యలను పరిశీలించారు. ఎగువన ఉన్న బడంగ్పేట్ కార్పొరేషన్ బాలాపూర్ తదితర ప్రాంతాల నుండి భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఉప్పెనలా వచ్చే వరద నీటికి తోడు డ్రైనేజీ కలుస్తుండడం వల్ల దిగువన ఉన్న మీర్పేట్ కార్పొరేషన్లోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఆమె తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిశీలించిన ఆమె మాట్లాడుతూ ఈ విధమైన సమస్యలను తీర్చాలనే ఉద్దేశ్యంతో తన వినతి మేరకు నాటి సిఎం కెసిఆర్ మహేశ్వరం నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేయక ప్రజా సమస్యల పరిష్కారాన్ని, అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆమె ఆరోపించారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఎస్డిఎఫ్ నిధులను విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంతకు ముందు స్థానిక కమీషనర్ నాగమణితో ప్రజల ఇబ్బందులు తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ వేణుగోపాల్, స్థానిక మాజీ ఎంపిటిసి జె.శ్రీనివాస్ నాయక్, స్థానిక మాజీ కార్పొరేటర్ సౌందర్య విజయ్లతో పాటు అర్కల భూపాల్రెడ్డి, అర్కల కామేష్రెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, ఉయ్యాల నవీన్గౌడ్, మాదరి రమేష్, సునీత బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తమే ఆస్తి రక్షణకు కవచం : సిపి సుధీర్ బాబు



**నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, సెప్టెంబర్ 20 (ప్రభాతవార్త):**
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దొంగతనాలు, దోపిడీలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఐపీఎస్ సూచించారు. నేరేడ్మెట్లోని సీపీ కార్యాలయంలో గేటెడ్ కమ్యూనిటీ, విల్లా అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం ఆయన ప్రత్యేక భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కొత్త వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సిబ్బంది విషయంలోనూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరం జరిగినట్లు సమాచారం అందిన ఆరు నిమిషాల్లోనే పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుంటారని హామీ ఇచ్చారు.సీపీ సుధీర్ బాబు భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఇంటిలోనూ హై డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను లోపల, బయట, గేటు వద్ద, రహదారి వైపు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్తో అనుసంధానం చేయడం వల్ల నేరాలను అదుపులో ఉంచవచ్చని చెప్పారు. అలాగే అలారం సిస్టమ్స్ తప్పనిసరి అని, తలుపులు, కిటికీలకు బలమైన గ్రిల్స్, లాక్లు అమర్చుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ చీకటి ప్రదేశాలు లేకుండా సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని, మోషన్ సెన్సార్ లైటింగ్ వాడితే మరింత భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. పొరుగువారితో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలపై వెంటనే సమాచారం అందించడం సులభమవుతుందని తెలిపారు.ప్రొఫెషనల్ సెక్యూరిటీ గార్డుల నియామకం అవసరమైతే తప్పనిసరి చేయాలని, సెలవులకు వెళ్లే విషయాన్ని లేదా ఇంట్లో లేని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయకూడదని ఆయన హెచ్చరించారు. ఈ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా దొంగతనాలు, దోపిడీలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డీసీపీ మల్కాజిగిరి పద్మజ, ఎల్బీ నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, ఎస్బీ డీసీపీ జి. నరసింహ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధితో పేదలకు లబ్ది : ఎమ్మెల్యే సుధీర్రెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్తో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్ఘాట్కు చెందిన కొండ సాయిరాంగౌడ్ అనారోగ్యంతో భాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్రెడ్డిని కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎంఆర్ఎఫ్ ఇప్పించాలని కోరడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్రెడ్డి, సాయిరాంగౌడ్ చేత దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.45 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్రెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని, నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందడానికి సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త చేగోని మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న చెరువులో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలి : శ్రీవాణి



బతుకమ్మ ఉత్సవాలపై కమిషనర్కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ సంప్రదాయాలకు, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను రామంతాపూర్ చిన్న చెరువులో నిర్వహించాలని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ డిప్యూటి కమిషనర్ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ చిన్న చెరువులో బతుకమ్మ పండుగ జరుపుకునేందుకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ రాజు స్పందిస్తూ చిన్న చెరువులో బతుకమ్మ పండుగ ఏర్పాట్లను తక్షణమే చేపట్టాలని డిఇ నాగమణి గారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా మోర్చ అధ్యక్షురాలు తాళ్ల మంగ,అంబటి భాగ్యలక్ష్మి మ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



షటిల్ కోర్ట్లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. సెప్టెంబర్.20.ప్రభాతవార్త.**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ లో గల ఇందిరాగాంధీ షటిల్ కోర్ట్ ఇండోర్ స్టేడియం లో సరైన వసతులు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చినప్పుడు పై కప్పు నుండి ఇండోర్ స్టేడియంలోకి నీరు చేరి చెరువును తలపిస్తున్నది.దీంతో క్రీడాకారులు షటిల్ ఆట ఆడలేక ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడాకారులు విషయాన్ని స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డి కి తెలియజేయడంతో శనివారం కార్పొరేటర్ షటిల్ కోర్ట్ ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే జి.ఎచ్.ఎం. సి. స్పోర్ట్స్ అధికారిని అంబికా రాణి ని పిలిపించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. షటిల్ కోర్ట్ నిర్వహణ పై ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం ఇండోర్ స్టేడియంలోకి రాకుండా మరమ్మతులు చేపట్టి,క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని అధికారిని కార్పొరేటర్ కు తెలియజేసింది.కార్యక్రమంలో క్రీడాకారులు అజయ్,మూర్తి, అనిల్,జశ్వంత్, జగన్ పాల్గొన్నారు.

## 25వ నుంచి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు



వివరాలను వెల్లడిస్తున్న కోశిక శ్రీనివాసరావు, చిత్రంలో బోనగిరి చంద్రశేఖర్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** ముసారంబాగ్ డివిజన్ శాలివాహన నగర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు కోసిక శ్రీనివాసరావు పేర్కొన్నారు. శాలివాహన నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యచార్యుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి, గణపతి, శివగంగా, ఆంజనేయ స్వామి, జంట నాగులు, శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనునట్లు వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భోనగిరి చంద్రశేఖర్, నరసింహ చారి, జంగయ్య గౌడ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుల అరెస్టు

**హయత్ నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**
తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను హయత్ నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కర్మన్ ఘాట్ కు చెందిన మండల శివ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వ్యాసనాలకు డబ్బులు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇంతకు ముందు అతను జైలుకు సైతం వెళ్ళాడు. జైలు లో అతనికి బీఎన్ రెడ్డి నగర్ కి చెందిన ఏళ్ళ బాలకృష్ణ తో పరిచయం ఏర్పడింది. 20 రోజుల క్రితం బెయిల్ మీద బయటకు వచ్చిన శివ బంజారాకాలనీ లో బంధువుల ఇంట్లో ఉంటూ బాలకృష్ణతో కలిసి దొంగతనం చేయడానికి ప్లాన్ చేసాడు. ఈ క్రమంలో తప్పించుకోవడానికి బాలకృష్ణ కారును తీసుకురమ్మన్నాడు. వారిరువురు కలిసి ఈ నెల 6న ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో, 13న మునుగనూరు గ్రామం జయసూర్య నగర్ లో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును అపహరించుకు పోయారు. వాటిని శివ స్నేహితుడు మోత్కూర్ శ్రీకాంత్ ద్వారా ఎల్ బీనగర్ లోని అట్టిక గోల్డ్ షాప్ లో విక్రయించారు. పోలీస్ తనిఖీలలో భాగంగా భాగ్యలత కాలనీ వద్ద అనుమానస్పదంగా సంచరిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనాలకు సంబంధించిన విషయాలు భయట పడ్డాయి. ఈ మేరకు వారిని అరెస్టు చేసి 22.6 తులాల బంగారు ఆభరణాలు, 6 తులాల వెండి ఆభరణాలు, 3 లక్షల రూపాయల నగదు, వాచి, కారును స్వాధీనం చేసుకున్నారు.

## యువత సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా ఉండాలి: అందెల



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** బిజెపిలో ఉన్న యువత సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడి 75వ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర బిజెపి ఇచ్చిన సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం బడంగ్పేట్ కార్పొరేషన్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్భూపాల్గౌడ్ హాజరయ్యారు. అయితే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అందెల మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో బిజెపి యువత ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకట్రెడ్డి, ఏనుగు ప్రభాకర్రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డ, రామోజీ శ్రీశైలంచారి, రామిడి వీరకర్ణారెడ్డి, తోట శ్రీధర్రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల శ్రీకాంత్గౌడ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పెంపు హామీని రేవంత్ సర్కార్ నిలబెట్టుకోవాలి: ఎమ్మార్పీఎస్



దివ్యాంగులతో కలిసి బడంగ్పేట్ కార్పొరేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ బొర్ర రవి తదితరులు

**సరూర్నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**
అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పెన్షన్లను పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనీ లేని పక్షంలో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్దారులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాలు చేస్తుందని రంగారెడ్డి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవికుమార్ మాదిగ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పెన్షన్ మొత్తాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్ను రూ. 6 వేలకు, వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళల పింఛన్లను రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా పింఛన్లు పెంచకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు కామాచి మహేష్, ఉపాధ్యక్షులు అల్లం రామకృష్ణ, లీగల్ అడ్వయిజర్ ప్రేమ్కుమార్లతో పాటు చాగంటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో కుమ్మరి సంఘం భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కుమ్మరి సంఘం నేతలు

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** ఉప్పల్లో కుమ్మరి సంఘం భవనం నిర్మించాలని పలువురు కుమ్మరి సంఘం నేతలు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్తో కలిసి వారు పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఖచ్చితంగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్లో కుమ్మరి సంఘం భవనం నిర్మించి హామీ నిలబెట్టుకుంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కురుమ సంఘం నాయకులు బి.బోగుట యాదయ్య, బి.మల్లేష్, భాస్కర్, అశోక్, బుల్లెట్ కృష్ణ, వి.జంగయ్య, ప్రకాష్, బి.రాధా కిశోర్, కీసర భిక్షపతి,బి మహేష్, భిక్షపతి,బి.కృష్ణ పాల్గొన్నారు

## పేదలకు సిఎం సహాయనిధి వరం : కార్పొరేటర్ రాజశేఖర్రెడ్డి



చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** సిఎం సహాయనిధి పేద ప్రజలకు వరంలాంటిదని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ నవోదయ కాలనీకి చెందిన కుంట గోపాల్రెడ్డి గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ రాజశేఖర్రెడ్డిని కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరడంతో ఆయన వెంటనే స్పందించి గోపాల్రెడ్డి చేత దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గోపాల్రెడ్డికి వార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**కుషాయిగూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త.**
దసరా సెలవుల నేపథ్యంలో అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల, కుషాయిగూడలో బతుకమ్మ సంబరాలు అలాగే దాండియా నైట్ ఘనంగా నిర్వహించారు. శనివారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నుల పండుగగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు తంగేడు పూలతో, వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను సర్వాంగా సుందరంగా అలంకరించి, తదనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సిపాల్ శ్రీమతి రితిక బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తల్లదండ్రులకు దసరా శుభాకాంక్షలు తెలియచేసారు.